క్లుప్తంగా

కురుమ సంఘం కమిటీ ఎన్నిక



లోగో ఆవిష్కరిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ: పాల్వంచ పట్టణ కురుమ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా కాకర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా సుంక పెద్దాపురం లను ఎన్నుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా కొల్లె సాయికుమార్, జాయింట్ సెక్రటరీ పేరం కుమార్, కోశాధికారిగా వెంగళ చేరాలు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎలకపల్లి వెంకటేశ్, ఈరాళ్ల గట్టయ్య, ఏనుగుల రాములు, కాకర్ల లింగయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వ రరావును కలిసి నూతన కమిటీ పరిచయం చేసుకున్నారు. అనంతరం సంఘ లోగోను వనమా ఆవిష్కరించారు.

బీఎస్పీలో చేరిక



రాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఇల్లెందు: తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లచ్చగూడెం గ్రామానికి చెందిన ముక్తి రాజు బీఎస్పీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు కోటి, రాజేష్, నరేష్, డాక్టర్ వెంకటేష్ చౌహాన్, రవికుమార్, ప్రతాప్, రఘు ఉన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రధాని మోదీ



మాట్లాడుతున్న హన్మేష్

ఇల్లెందు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.హన్మేష్ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ విద్యా విజ్ఞాన రాజకీయ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న కుయుక్తులను విద్యార్థి సంఘాలు ఐక్యంగా అడ్డుకోవాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజా వ్యతిరేకతను మళ్లించేందుకు ప్రజల మధ్య కుంపట్లు రాజేస్తున్నట్లు ఆరోపించారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ జాతీయ పరిస్థితులు అంశంపై మాట్లాడారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ పీడీఎస్‌యూ చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు అనిల్, భాస్కర్, పృథ్వీ, నరేందర్, సంధ్య, నరసింహారావు, స్వాతి, సాయి, నరేందర్, వెంకటేష్, నరేష్, సుమంత్, హలీంపాషా, తిరుపతి, దీపిక, పవిత్ర, గణేష్, అషూర్, అనిల్, నవీన్, కావ్య, సీతారాం, అజయ్ పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయం పత్తి

- మండలంలో 10,785 ఎకరాల్లో పంట సాగు
- గత సంవత్సరం కంటే పెరిగిన సాగు



పత్తి చేలో కలుపు తీస్తున్న కూలీలు

సుజాతనగర్: నేల, వాతావరణం భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా వర్షాధార పంట అయిన పత్తి పంట రైతులకు లాభాలను తెచ్చిపెడుతుంది. ఈసారి వానాకాలం పంటల సాగులో రైతులు పత్తి పంట వైపే మొగ్గు చూపారు. సుజాతనగర్ మండలంలో 10,785 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు రావడం, గిట్టుబాటు ధర కూడా అనుకూలంగా ఉండడంతో ఎక్కువ శాతం మంది రైతులు వరి సాగు ప్రత్యామ్నాయంగా పత్తినే ఎంచుకున్నారు.

వాణిజ్య పంట కావడంతో..

తెలంగాణ పత్తికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. మన దగ్గర పత్తి పింజ పొడవు చాలా ఎక్కువ. దీంతో నాణ్యమైన దారం ఉత్పత్తి అవుతుంది. పత్తి పంట వాణిజ్య పంట కావడం, అధిక దిగుబడులు వస్తుండడంతో వరి, మొక్కజొన్న కంటే పత్తి మేలనే ఉద్దేశ్యంతో పత్తినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. విత్తనాల ధర అందుబాటులో ఉండటం, మద్దతు ధర వస్తుండడంతో రైతులు అధికంగా పత్తి వైపే మొగ్గు చూపారు. మొక్కజొన్నకు పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. వాటిని నివారించడం కష్టంతో కూడుకున్న పని. పత్తి పంటకు మందులు కూడా తక్కువగా కొట్టే విధానం రావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇతర పంటలకు కూలీల కొరత కూడా అధికంగా ఉంటుంది. పత్తి సాగుకు అనుకూలమైన వాతావరణం, సులువుగా అమ్ముకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో పత్తి విత్తనాలు కొనాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చేది.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పత్తి విత్తనాల ధరలతో పాటు పంట అమ్ముకునేందుకు మార్కెట్ కూడా అందుబాటులో ఉంది. గత ఏడాది 9,326 ఎకరాల్లో సాగు చేయగా... ఈ సీజన్‌లో 10,785 ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంటను సాగయింది.

సాగు విస్తీర్ణం పెంచాం..



గత సంవత్సరం నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. పెట్టుబడికి వచ్చిన దిగుబడికి సరిపోయింది. అప్పు కాలేదు. లాభం రాలేదు. ఈ ఏడాది మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. **– నారాయణ, రైతు, పాత అంజనాపురం**

నాలుగు ఎకరాల్లో సాగు చేశాను



నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ఇప్పటి వరకు రూ.60 వేల పెట్టుబడి అయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కలుపు బాగా పెరిగింది. పెరిగిన ఖర్చుల దృష్ట్యా మద్దతు ధర రూ.10 వేలు ఉండాలి. **– గద్దం రాజేందర్, రైతు, సుజాతనగర్**

డిమాండ్ ఉండడంతో సాగు పెరిగింది



తెలంగాణలో పత్తికి డిమాండ్ ఉంది. ప్రభుత్వం మద్దతు ధర కూడా ఇస్తోంది. దీంతో పత్తి పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 10,785 ఎకరాల్లో పత్తి సాగయింది. **– గాండ్ల నర్మద, ఏఓ, సుజాతనగర్**

రేపు ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: సింగరేణి సంస్థలో వివిధ విభాగాల నుంచి ప్రతి స్వాతంత్ర దినోత్సవానికి ఉత్తమ కార్మికులతోపాటు, ఉత్తమ సింగరేణియన్‌ను ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా ఈ 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో తొమ్మిది మంది... బడిశ శివరాం (ఫోర్‌మెన్) పీవీకే–5షాఫ్ట్, గుండా వెంకటరావు, కన్వేయర్ ఆపరేటర్ పీవీకే–5షాఫ్ట్, దాట్ల నెహ్రూ రాజు, ఈపీ ఆపరేటర్ (జీకేఓసీ), గద్దం నర్సింగరావు, ఈపీ ఆపరేటర్ (జీకేఓసీ), తీగల క్రాంతికుమార్, ఈపీ ఆపరేటర్ (జేవీఆర్ఓసీ), బానాల వెంకటేశ్వర్లు, ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్ (ఎలక్ట్రికల్) జేవీఆర్ఓసీ, సంద్రి శ్రీనివాస్ హెడ్ ఓవర్ మెన్ (క్రిష్టారం ఓసీ), ఎస్.నాగేందర్‌రావు, ఎలక్ట్రీషియన్, జేవీఆర్ఓసీ సీహెచ్‌పీ, ఇల్లెందు ఏరియా నుంచి ఆరుగురు...ఆర్.సాంబశివరావు (ఫిట్టర్, కేఓసీ), పి.గంగాధర్ (ఈపీ ఆపరేటర్, జేకే ఓసీ), బి.రమేష్‌బాబు, (మోటార్ మెకానిక్, జేకేఓసీ), కె.లక్ష్మయ్య, ఫిట్టర్, కేఓసీ, బి.రాజ్యు (జనరల్ మజ్దూర్ కేఓసీ), డి.శ్రీకాంత్, జనరల్ మజ్దూర్, సీహెచ్‌పీలను యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసింది.

వీరిని రేపు జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏరియా జీఎంలు సన్మానించనున్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయండి



మాట్లాడుతున్న చాంద్‌పాషా

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పగడాల అఖిల్, ఎస్కే చాంద్‌పాషాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. జూలూరుపాడు మండల ఏజెన్సీ ప్రాంతం కావడంతో అధిక శాతం గిరిజనులు, నిరుపేదల ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం పీహెచ్‌సీగా కొనసాగుతున్నప్పటికీ గిరిజనులకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. అప్‌గ్రేడ్ చేస్తామని అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదన్నారు. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి 100 పడకల ఆస్పత్రిగా మార్చే విధంగా స్థానిక ఎమ్మెల్యే రాములు నాయక్ కృషి చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహేష్, నరేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

దంత వైద్యంపై పట్టు సాధించాలి

పాల్వంచ: ఎప్పటికప్పుడు మారుతున్న దంత వైద్య విధానంపై వైద్యులు పట్టు సాధించాలని జీపీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి డాక్టర్ చంద్రమౌళి అన్నారు. ఆదివారం పాల్వంచలోని ఓ రెస్టారెంట్‌లో కంటిన్యూయింగ్ డెంటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వైద్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీని అనుసరిస్తూ మార్పులకు అనుగుణంగా వైద్యం అందించడమెలా అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో దంత వైద్యులు నాగుబండి కిరణ్, చైతన్య, మోహన్‌బాబు, ఆర్.సునీల్, టి.అమరేందర్ రెడ్డి, షారజ్, ప్రవీణ్, యుగంధర్, ప్రమోద్, విజయలక్ష్మి, కవిత, షర్మిల, కల్యాణి, శైలజ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా దంత వైద్యులు

ఉచితంగా ఉపాధి శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏజీఎం పర్సనల్ సామ్యుల్ సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి ప్రభావిత పరిసర గ్రామాలలోని యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పనకై యాజమాన్యం వివిధ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తోందని చెప్పారు. రామవరం, రుద్రంపూర్, పెనగడప, సేవా సెంటర్‌లలో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సులలో పరిసర ప్రాంత మహిళలు శిక్షణ పొంది ఆర్థిక ప్రగతి సాధించాలని పేర్కొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీలో బీజేవైఎం నాయకులు

చుంచుపల్లి: బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ పిలుపు మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా నినాదంతో ఆదివారం కొత్తగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, సూపర్ బజార్ మీదుగా ఓల్డ్ బస్టాండ్ వరకు ఈ బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జోగు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు రవీందర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు హరిహరన్ యాదవ్, విజయ్, కిరణ్, రాహుల్, రాజా పాల్గొన్నారు.

పాటలతోనే ప్రజా ఉద్యమాలు

ఇల్లెందురూరల్: తన పాటలతోనే గద్దర్ ప్రజా ఉద్యమాలు నడిపారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి యనగంటి చిరంజీవి అన్నారు. మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామంలో గద్దర్ సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ.. విప్లవోద్యమాలకు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు గద్దర్ తన పాటలతో ఊపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రజల్లో చైతన్యం రగిలించి ఉద్యమబాటలో పయనింపజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోగ రమేష్, కాంతారావు, ఎట్టి నర్సింహారావు, జోగ చంటి, కల్తి రామ్మూర్తి, ఏనుగు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటలో ఇసుక దందా..



ఖాళీ స్థలంలో డంప్ చేసిన ఇసుక

పాల్వంచ: ఎర్రగుంట గ్రామంలో ఇసుక దందా ఇష్టారాజ్యంగా సాగుతోంది. మొర్రేడు వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌ల ద్వారా తెచ్చి గ్రామ శివారులో డంపింగ్ చేసి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక దందాపై పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చీకటి పడితే చాలు ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తగూడెంటౌన్: శ్రీరామచంద్ర పాఠశాలలో 1999–2000 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి గురువులు ఏవీఎల్ నర్సింహారావు, ల్యూసీ, మంగతాయారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈ వేదికకు ఆర్గనైజర్లుగా వ్యవహరించిన దత్తు, సురేష్, శేఖర్, రామకృష్ణ, మహేష్‌లను తోటి విద్యార్థులు అభినందించారు.



1999-2000వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

సుజాతనగర్: నేటికాలంలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదని ప్రముఖ వైద్యులు కె.రఘునాథ్, రాఘవరావు అన్నారు. కాసాని లక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం సుజాతనగర్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బీపీ, షుగర్‌ను చిన్నవని నిర్లక్ష్యం చేస్తే వాటి ప్రభావం కంటి చూపుపై పడుతుందన్నారు. శిబిరంలో పలువురికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాసాని ఐలయ్య, వీర్ల రమేష్, గండమాల భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: ఈనెల 20న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కన్వీనర్ ఎండీ మంజూర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అమర వీరుల స్తూపం వద్ద సదస్సు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంజూర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సర్వం కోల్పోయిన ఉద్యకారులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమయిందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని ఆరోపించారు. ఆత్మగౌరవ సదస్సుకు ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో శ్రావణ బోయిన నర్సయ్య, శ్రీపాద సత్యనారాయణ, ఇజ్జగాని రవిగౌడ్, బొల్లం భాస్కర్, హుస్సేన్, సూరిబాబు, సీతారాములు, రవీందర్, మురళీ కృష్ణ, జాని, శ్రీను, ఆదిల్, రోహిత్, నాగరాజు, ఇమామ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు పోరాడుదాం..

జూలూరుపాడు: హక్కుల పరిరక్షణ కోసం గిరిజనులందరూ ఐక్యంగా పోరాడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ నియమాల రక్షణ చట్టం తీసుకరావడంతో రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులకు భంగం కలుగుతోందన్నారు. కార్పొరేట్ శక్తులకు అటవీ సంపదపై హక్కు కల్పించడం వల్ల గిరిజన హక్కులను కాలరాయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పోడు రైతులకు హక్కు పత్రాలు అందించాలన్నారు. ఆదివాసీ జాతీయ నాలుగో మహాసభలు వచ్చే నెల 19, 20, 21వ తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్‌లో జరుగుతాయని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీ, భూక్యా కృష్ణ నాయక్, లకావత్ శ్రీను, గార్లపాటి వెంకటి, వల్లమల్ల చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరభద్రం

'హైవే' సర్వేపై స్థానికుల ఆందోళన



చర్చిస్తున్న అఖిలపక్షం నేతలు, బాధితులు

టేకులపల్లి: నేషనల్ హైవే 930పి రహదారి సర్వేతో మండలవాసులు ప్రధానంగా జంక్షన్ల వద్ద ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఆదివారం బేతంపూడి స్టేజీ, గోలియాతండా, టేకులపల్లి సెంటర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, కారుకొండ క్రాస్‌రోడ్, సీతారాంపురం స్టేజి బాధితులు మండల కేంద్రంలో సమావేశమయ్యారు. రోడ్డు విస్తీర్ణం వల్ల చాలామంది సర్వం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యలను కలిసి వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో లక్కినేని సురేందర్‌రావు, గుడిపూడి మోహన్‌రావు, చీమల సత్యనారాయణ, గుడిపూడి కృష్ణార్జున్‌రావు, శంకరాచారి, చిత్ర సర్వేష్, నోముల భానుచందర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ బోనాలు



ఇల్లెందురూరల్: మాణిక్యారంలో బోనాలతో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, స్థానిక మహిళలు



పాల్వంచరూరల్: పాండురంగాపురం తండాలో బోనాలతో వెళ్తున్న గిరిజనులు

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం, బొజ్జాయిగూడెం గ్రామాల్లో ఆదివారం శ్రావణమాస బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు అమ్మవారికి నైవేద్యంగా బోనం సిద్ధం చేసుకొని డప్పు వాయిద్యాలతో ప్రదర్శనగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మాణిక్యారం గ్రామంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బానోత్ రోజా, మండల రాము, పూనెం సురేందర్, స్థానికులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పాండురంగాపురం తండాలో ఆదివారం స్థానిక గిరిజనులు ముత్యాలమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా జగదీష్‌కుమార్, గ్రామపెద్దలు కిషన్, హరిలాల్, లక్‌పతి, భరత్, రాంప్రసాద్, దస్రు, రవిచందర్, జబ్రులాల్, కిషోర్, మంగీలాల్, లాలు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తాగునీటి వృథాను అరికట్టరా ?

మున్సిపాలిటీలోని అల్లూరి సెంటర్ వద్ద తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్ వద్ద నీరు వృథాగా పోతోంది. నిత్యం లీక్ అవుతుండడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వాల్వ్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. – పాల్వంచ



ప్రశ్నించాల్సిన అధికారి : రాజేశ్, ఏఈ
సెల్ నంబర్: 9849908225

తండాల్లో ఘనంగా తీజ్ వేడుకలు



టేకులపల్లిలో తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

ఇల్లెందురూరల్: మిట్టపల్లి గ్రామంలో తీజ్ వేడుకలను ఆదివారం స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షతో గోధుమ మొలకలు పెంచిన యువత బంజారా దేవతకు ప్రత్యేక పూజ చేసి సంప్రదాయ పద్ధతిలో ఆడిపాడారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య హాజరై యువతులతో కలిసి నృత్యం చేసి సందడి చేశారు. అనంతరం తీజ్ బుట్టలను మేళతాళాలు, భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

టేకులపల్లి: బంజారాలకు అత్యంత పవిత్రమైన తీజ్ (బతుకమ్మ) వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి, దాసుతండా, గోలియాతండా తండాలల్లో ఏర్పాటు చేసిన తీజ్ మంచె (పందిరి)ల వద్ద తండా పెద్దలు ప్రత్యేక పూజలు, భోగ్ బండారో నిర్వహించారు. ఆ తరువాత యువతులు తీజ్ బుట్టలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరి రామాలయం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ ఆట పాటలతో బతుకమ్మ ఆడి సందడి చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే హరిప్రియ , జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలు పాల్గొన్నారు.

రామాలయం వద్ద ఎమ్మెల్యే, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు వేడుకల్లో ఆట పాటలతో సందడి చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పరుచూరి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



టేకులపల్లి రామాలయం వద్ద తీజ్ కోలాహలం



వేడుకలో నృత్యం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య



ఇల్లెందురూరల్: నృత్యం చేస్తున్న యువతులు